నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 1 మార్చి 2025 VIKARABAD



రిజిస్ట్రేషన్ల కోసం శుక్రవారం రాత్రి పూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

## సర్వర్ డౌన్ నిలిచిన రిజిస్ట్రేషన్లు

- రెండు రోజుల్లో అయిన రిజిస్ట్రేషన్లు 20 మాత్రమే
- రైతులు రాత్రి వరకు వేచి చూసినా ఫలితం నిల్

సర్వర్ డౌన్ కావడంతో గత రెండు రోజులుగా పూడూరు మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దీర్ఘకాలిక రుణాల కోసం మాడిగేషన్ స్లాట్లు బుక్ చేసుకున్నారు. అయితే, పోర్టల్‌లో సర్వర్ మొరాయించడంతో రైతులు రాత్రి వరకు వేచి చూసినా రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 15, శుక్రవారం 30 కలిపి మొత్తం 45 రిజిస్ట్రేషన్ల కోసం రైతులు స్లాట్లు బుక్ చేసుకోగా కేవలం 20 మాత్రమే పూర్తి అయ్యాయి. తనఖా రుణాలకు గడువు శుక్రవారమే కావడంతో వారు ఆందోళన చెందారు. గడువు తేదీని పెంచి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

-పూడూరు, ఫిబ్రవరి 28

## భారమైన కన్నతల్లి..




మన్సూరాబాద్, ఫిబ్రవరి 28 : నవ మాసాలు మోసి..కని పెంచిన తల్లి.. కుమారుడికి భారమైంది. కనికరం లేకుండా ఆమెను రోడ్డున పడేశాడు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని సీత్యాతండాకు చెందిన ధర్మీ (80)కి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు చనిపోగా, చిన్న కుమారుడైన లక్ష్మానాయక్‌తో కలిసి ఎల్బీనగర్ ప్రాంతంలో నివాసముంటున్నది. వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఆలనాపాలన చూసుకోవాల్సిన కొడుకు ఆమెను భారంగా భావించాడు. గురువారం సాయంత్రం ఆమెను ఆటోలో తీసుకొచ్చి మన్సూరాబాద్ చిత్రసీమ కాలనీలోని లిటిల్ చాంప్స్ స్కూల్ సమీపంలో వదిలివెళ్లాడు. దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ రోడ్డు పక్కన ఉన్న ధర్మీని కాలనీవాసులు చేరదీశారు. అన్నపానీయాలు అందించారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు వృద్ధురాలిని అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలోని ఆలేటి అనాథ వృద్ధాశ్రమానికి తరలించారు.

# పన్ను కట్టకుంటే నీళ్లు బంద్..!

## బకాయిల వసూలుకు నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

- మున్సిపాలిటీలను వెంటాడుతున్న నిధుల కొరత
- వచ్చే కొద్దిపాటి నిధులూ ఉద్యోగుల జీతభత్యాలు, తాగునీరు, పారిశుధ్యం పనులకే సరి..
- కొత్త కాలనీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు నిల్
- పన్నులు చెల్లించకుంటే సర్వీసులను నిలిపేసే యోచనలో అధికారులు



మున్సిపాలిటీల్లో నిర్దేశించిన స్థాయిలో పన్నులు వసూలు కాకపోవడంతో నిధుల కొరత వెంటాడుతున్నది. కొత్త కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు నిధులు సరిపోవడం లేదు. దీంతో పన్నుల వసూలు కోసం అధికారులు ఆయా మున్సిపాలిటీల్లో నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. ట్యాక్స్ చెల్లించని వారికి మున్సిపాలిటీ ల నుంచి అందుతున్న తాగునీరు, పారిశుధ్యం వంటి సర్వీసులను నిలిపేయాలని భావిస్తున్నారు.

-రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)

### జిల్లాలో 15 మున్సిపాలిటీలు..

జిల్లాలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నాయి. ప్రతి మున్సిపాలిటీల్లోనూ వసూలవుతున్న కొద్దిపాటి నిధులతో ఉద్యోగుల జీతభత్యాలు, విద్యుత్ చార్జీల చెల్లింపునకే సరిపోతున్నదని అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో మున్సిపాలిటీకి జీతభత్యాల రూపంలో ప్రతి నెలా రూ.30 నుంచి రూ. 40 లక్షల వరకు ఖర్చు అవుతున్నది. తాగునీరు, పారిశుధ్య పనులకు ఉపయోగించే వాహనాల డీజిల్ ఖర్చు, ఇతరత్రా ఖర్చులు కలిపి మొత్తం ఒక్కో మున్సిపాలిటీకీ నెలకు రూ.కోటి వర కు వెచ్చించాల్సి వస్తున్నది. దీంతో పన్నుల ద్వారా వస్తున్న నిధులు పై వాటికి సరిపోతుండడంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత వెంటా డుతున్నది. నగర శివారులోని అనేక మున్సిపాలిటీల్లో కొత్త కాలనీల ఏ ర్పాటు శరవేగంగా జరుగుతున్నది. పెరుగుతున్న కొత్త కాలనీలకు రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి మౌలిక వసతులను కల్పించేందుకు నిధులు సరిపోవడం లేదు.

### 50 శాతమే వసూలు..

ఈ ఏడాదిలో ఇప్పటివరకు జిల్లాలో 50 శాతమే పన్ను లు వసూలయ్యాయి. ఒక్కో మున్సిపాలిటీ నుంచి సుమారుగా రూ.ఐదు నుంచి రూ.ఆరు కోట్ల వరకు పన్నులు రావాల్సి ఉండగా అందులో సగమే వసూలయ్యాయి. నిర్దేశించిన పన్నులతోపాటు బకాయిలూ పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఒక్క ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోనే ఈ ఏడాది రూ. 5 కోట్లు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అదనంగా మరో రూ.4 కోట్ల బకాయిలు ఉన్నాయి. మొత్తం రూ.9 కోట్ల లో రూ. 3 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇలాంటి పరిస్థితి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ ల్లోనూ ఉన్నది. ఈ సమస్యను అధిగమించేందుకు పన్నుల వసూలే ముఖ్యమని అధికారులు భావిస్తున్నారు.

### బృందాలుగా బకాయిదారుల వద్దకు..

జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసేందుకు శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఒక్కో మున్సిపాలిటీలో మూడు నుంచి నాలుగు బృందాల సభ్యులు.. బకాయిదారుల వద్దకు వెళ్లనున్నారు. బకాయిలు చెల్లించని వారికి మున్సిపాలిటీల నుంచి అందే తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను నిలిపివేయాలని నిర్ణయించారు.

### మొండి బకాయిలను వసూలు చేయనున్నాం..



పన్నులు వసూలు కాకపోవడంతో మున్సిపాలిటీల్లో నిధుల కటకట ఏర్పడింది. ట్యాక్స్ వసూలు కోసం నేటి నుంచి మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మొండి బకాయిలను వసూలు చేయనున్నాం. పన్నులు చెల్లించని వారి ఇండ్లకు తాగునీరు కలెక్షన్ తొలగించడంతోపాటు చెత్త సేకరణ ట్రాక్టర్లనూ బంద్ చేస్తాం. ప్రజలు మున్సిపాలిటీల్లో పన్నుల చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

-రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం



## ఇంకా టీయాప్ ఫోలియో పేరే

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల బెడద లేకుండా.. వాహనదారులకు పారదర్శకమైన సేవలందించేందుకు కేసీఆర్ పాలనలో తీసుకొచ్చిన 'టీ యాప్ ఫోలియో' యాప్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఆ యాప్ ద్వారా అందుతున్న సేవలను 'మీసేవ' యాప్‌లోకి మార్చింది. అందులో రిజిస్ట్రేషన్లు, అప్లికేషన్ అండ్ సర్టిఫికేషన్స్ సేవలతోపాటు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ సేవలను చేర్చింది. వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా ఆర్టీఏ సేవలను ఆన్‌లైన్‌లో ఒకేచోట అందించిన రవాణా శాఖ తాజాగా 'మీసేవ' యాప్‌లోకి టీయాప్ ఫోలియో సేవలను బదలాయించింది. అయితే, వాహనదారులు ఆర్టీఏ వెబ్‌సైట్‌లోకి వెళితే అందులో ఇంకా టీయాప్ ఫోలియో సేవలనే వినియోగించుకోండని సూచించడం విశేషం. కానీ, ఆ యాప్‌ను ప్రస్తుతం ప్లేస్టోర్‌లో అన్వేషిస్తే మాత్రం కనిపించకపోవడంతో వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఆర్టీఏ అధికారులు 'మీసేవ' యాప్‌లో ఆర్టీఏ సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయంపై వాహనదారులకు అవగాహన కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నది.

# మంటలంటుకొని..కారులో సిలిండర్ పేలి

## మొత్తం మూడు సిలిండర్లు పేలి.. చిన్నారి సహా ఇద్దరు మహిళల మృతి

మణికొండ, ఫిబ్రవరి 28 : మణికొండ మున్సిపాలిటీలోని పాషాకాలనీలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. విద్యుదాఘాతంతో చెలరేగిన మంటలు ఇంట్లోకి ఎగిసిపడి సిలిండర్లు పేలి ముగ్గురు మహిళలు అగ్నికి ఆహుతి అయ్యారు.

నార్సింగి ఠాణా పరిధిలోని పుప్పాలగూడ పాషా కాలనీలో జమీలాకాతూన్ (70) తన 15 మంది కుటుంబసభ్యులతో కలిసి రెండంతస్తుల భవనంలో నివాసం ఉంటున్నారు. కాగా, శుక్రవారం ఇంట్లోని మగవారు కొంతమంది బయటికి వెళ్లగా గ్రౌండ్ ఫ్లోర్‌లోని కిరాణా షాపులో అనుకోకుండా విద్యుదాఘాతంతో మంటలు వచ్చాయి. స్థానికులు వెంటనే అక్కడి నుంచి పరుగెత్తడంతో పక్కనే ఉన్న కారుకు మంటలు అంటుకుని అందులోని సిలిండర్ పేలి మొదటి అంతస్తులోని ఇంట్లోకి మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఇంట్లోని మరో రెండు సిలిండర్లు పేలాయి. అప్పటికే ఇంట్లో ఉన్న జమీలా కాతూన్ (70), తహనా కాతూన్(38), సిద్రా కాతూన్ (4) మంటలలో చిక్కుకుని అక్కడికక్కడే కాలిపోయారు. ఇంట్లోని మరో ఎనిమిది మంది మంటలను చూసి భయపడి రెండో అంతస్తులోకి పరుగెత్తి కేకలు వేయడంతో ఎగిసిపడుతున్న మంటలను చూసిన స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అగ్నికి ఆహుతి కావడంతోపాటు మూడు సిలిండర్లు, రెండు కార్లు కాలి బూడిదయ్యాయి. రెండో అంతస్తులో ఉన్న యూనిస్‌ఖాన్ ప్రాణం రక్షించుకునే క్రమంలో ఆ అంతస్తు నుంచి కిందకు దూకడంతో అతడి కాలు విరిగింది. నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను బయటికి తీసి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఘటనాస్థలికి చేరుకొని వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

### పాషాకాలనీలో విషాదఛాయలు

శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పాషా కాలనీలోని ఓ కుటుంబంలోని ముగ్గురు అగ్నికి ఆహుతి కావడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి.



మంటలను అరుపుతున్న అగ్నిమాపక సిబ్బంది



హోరాహోరీగా సాగుతున్న కుస్తీ పోటీలు



# కుస్తీ మే సవాల్

## జీవన్గిలో ఉత్కంఠగా సాగిన పోటీలు

బషీరాబాద్ మండలంలోని జీవన్గి గ్రామ మహాదేవలింగేశ్వరాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాశివరాత్రి జాతర ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా , ఉత్కంఠగా సాగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పోటీదారులు వచ్చారు. దాదాపు నాలుగు గంటలపాటు ఎంతో ఉత్కంఠగా జరిగిన పోటీల్లో చివరకు కర్ణాటకకు చెందిన యువకుడు విజేతగా నిలిచాడు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జీవన్గిలో వెలసిన మహాదేవలింగేశ్వరాలయంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ప్రతిఏటా ఆనవాయితీగా వస్తున్నది. వేలాది మంది జనం ఈ పోటీలను వీక్షించేందుకు తరలివచ్చారు. టెంకాయతో ప్రారంభమైన ఈ పోటీలు వెండి కడియంతో ముగిశాయి. చిన్న వారు చిన్న వారితో.. పెద్ద వారు పెద్దవారితో విడివిడిగా కుస్తీపట్లు పడ్డారు. ఫైనల్‌లో కర్ణాటకకు చెందిన సిద్ధు, మహారాష్ట్రకు చెందిన సంతోష్‌పాటిల్ తలపడగా సిద్ధు విజేతగా నిలిచాడు. ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెండి కడెంను బహుమతిగా ఇచ్చి ఘనంగా సన్మానించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ నారాయణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఉత్సవంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, తహసీల్దార్ వెంకటేశ్, ఆలయ కమిటీ చైర్మన్ మునిందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు మాణిక్‌రెడ్డి, పార్వత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్, రాములు, బస్సప్ప, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కాగా ఆలయ జాతర సందర్భంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న కలశాన్ని శుక్రవారం వేలం వేయగా బషీరాబాద్‌కు చెందిన ఆర్తి రూ. 1,05,000 దక్కించుకున్నారు.

-బషీరాబాద్, ఫిబ్రవరి 28

## గడువులోగా ఖాళీ చేయండి.. లేకుంటే తొలగిస్తాం

- చెరువుల వద్ద నిర్మాణాలపై హైడ్రా హెచ్చరిక
- ఆరు చెరువుల క్షేత్రస్థాయి పరిశీలన



సున్నంచెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): తాము ఇచ్చిన గడువులోగా ఇళ్లు, స్థలాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేకుంటే హైడ్రా ఆయా నిర్మాణాలను కూల్చివేయకతప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సున్నంచెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, బుమ్రుఖుద్దీన్‌దౌలా చెరువుల పునరుద్ధరణ పనులను కమిషనర్ రంగనాథ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. విమోస్ టెక్నోక్రాట్స్ రూపొందించిన డీపీఆర్, కాన్సెప్ట్‌లను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా సున్నంచెరువు వద్ద స్థానికులు ఉంటున్న నివాసాల వద్దకు వచ్చిన రంగనాథ్ అక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవద్దని, ఇవన్నీ అక్రమ నిర్మాణాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 8 లోగా అందరూ ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేకుంటే తామే వచ్చి అన్నింటినీ తొలగిస్తామని హెచ్చరించారు. స్థానికులు ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేసినా వారి మాటలను వినిపించుకోలేదు. చెరువులో పూడికతీత తీసేందుకు అందులోని నీటిని తొలగించేందుకు బ్రిడ్జి కింది భాగాన్ని కూల్చి నీళ్లు పోయేలా చేశారు. అనంతరం కూకట్‌పల్లి నల్లచెరువును రంగనాథ్ బృందం సందర్శించింది. అక్కడ బఫ ర్ జోన్‌లో పట్టా భూములు కలిగిన వ్యక్తులతో చర్చించారు. నల్లచెరువును సుందరీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ,చెరువులో పట్టాభూములు కలిగిన వారికి ప్రభుత్వం నుంచి టీడీఆర్ లేదా నష్టపరిహారం రూపంలో అందుతుందని రంగనాథ్ తెలిపారు. ఆ తర్వాత తమ్మిడికుంట, ఉప్పల్ నల్లచెరువు, బుమ్రుఖుద్దీన్ దౌలా చెరువులను సందర్శించి అక్కడ పరిస్థితులపై స్థానిక అధికారులతో చర్చించారు. చెరువుల బఫర్ జోన్లలో ఇంటిస్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ కింద సాయం చేస్తామని, ఇప్పటికే నివాసమున్న ఇళ్లను కూలగొట్టమని చెప్పారు. చెరువుల పరిరక్షణ, సుందరీకరణ, పునరుద్ధరణ పనుల్లో ఎక్కడా నివాసాలు తొలగించబోమని రంగనాథ్‌ స్పష్టం చేశారు.

సుమారు రూ. 58.50 కోట్లతో ఈ ఐదు చెరువులతో పాటు బతుకమ్మకుంటను మొదటివిడతగా అభివృద్ధి చేస్తున్నామని రంగనాథ్ తెలిపారు. ప్రస్తుతం ఈ చెరువుల్లోకి డివాటరింగ్ పనులను చేపట్టామని, ముందుగా చెరువులో ఉన్న వ్యర్థాలను బయటకు పంపి డ్రై చేసి ఆ తర్వాత పునరుద్ధరణ చేపడుతామని ఆయన చెప్పారు. ఇప్పటికే ఆరు చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని, జూన్ నాటికి చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు పూర్తవుతాయని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. అలాగే ప్రగతి నగర్ సంబంధించిన స్మశాన వాటిక ఆక్రమణకు గురవుతుందని ఫిర్యాదులు అందుకున్న నేపథ్యంలో శుక్రవారం రంగనాథ్ శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న 304, 305, 306 ల సర్వే నంబర్లను క్లైమ్ చేస్తూ ప్రైవేట్ వెంచర్ల నిర్వాహకులు పనులు చేస్తున్న నేపథ్యంలో సదరు స్థలాలను సైతం ఆయన పరిశీలించారు.